RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక



| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 190 | ఆగస్టు 10 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 190 | August 10 Monday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

## తుదిశ్వాస విడిచిన ప్రియాంక



**హైదారాబాద్ జనసంఘర్షణ**

రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడిన యువ వైద్యురాలు ప్రియాంక తుదిశ్వాస విడిచారు. గత కొద్ది రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో వెంటిలేటర్పై చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోవడం పట్ల సర్వత్రా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్య మాల్ ప్రాంతంలో ఆగస్టు 3వ తేదీన ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు అతివేగంగా కారు నడుపుతూ ఆమె ద్విచక్ర వాహనాన్ని ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. తొలుత రాజమండ్రిలోని స్థానిక ఆసుపత్రికి తరలించినప్పటికీ, పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి మార్చారు. అక్కడ వైద్యులు ఎంతగానో శ్రమించినా ఫలితం లేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక కన్నుమూసినట్లు వైద్యులు అధికారికంగా ప్రకటించారు . ఈ అమానుష ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ఇద్దరినీ ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. మరోవైపు, ఇది కేవలం రోడ్డు ప్రమాదం కాదని, తన కుమార్తెను ఉద్దేశపూర్వకంగా పొట్టనబెట్టుకున్న హత్య అని ప్రియాంక తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై సాధారణ ప్రమాద సెక్షన్లు కాకుండా హత్య కేసు నమోదు చేయాలని ఆయన తీవ్రంగా డిమాండ్ చేశారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు కావాలనే ఢీకొట్టినట్లు స్పష్టమవడంతో, కేసును హత్యాయత్నం సెక్షన్ల కింద మరింత కఠినతరం చేశారు. మృతురాలు ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్ గ్రామం. ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె, ప్రస్తుతం రాజమండ్రిలో పీజీ అభ్యసిస్తున్నారు. వైద్యురాలిగా ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువతి అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె స్వగ్రామంలో మరియు

## రానున్న మూడు రోజులు వర్షాలు



**హైదరాబాద్/అమరావతి జనసంఘర్షణ**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. రానున్న మూడు రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అమరావతి, హైదరాబాద్ వాతావరణ కేంద్రాలు వెల్లడించాయి.అల్పపీడన స్థితి – గాలుల తీవ్రత ఉత్తర ఒడిశా, దానిని ఆనుకుని ఉన్న జార్ఖండ్ సమీపంలో నిన్నటి వరకు ఉన్న అల్పపీడన ప్రాంతం, ఈ రోజు (ఆగస్టు 9, 2026) ఉదయానికి ఈశాన్య మధ్యప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్‌పై కేంద్రీకృతమై ఉంది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి నైరుతి దిశగా వంగి ఉంది. ఫలితంగా ఏపీ, యానాంలో నైరుతి, పశ్చిమ దిశల నుంచి ఈదురుగాలులు వీస్తున్నాయి. ప్రాంతాల వారీగా ఉత్తర కోస్తా ఽ యానాం: ఆది, సోమ, మంగళవారాల్లో పలుచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్: ఆదివారం నుండి మంగళవారం వరకు అక్కడక్కడ మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉంది. తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయి. రాయలసీమ: ఆది, సోమ, మంగళవారాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు లేదా జల్లులు పడే సూచనలు ఉన్నాయి. గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచవచ్చు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## అమర్ నాథ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత



**అమర్‌నాథ్ జనసంఘర్షణ**

మర్ నాథ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత నిర్ణయం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. భారీ వర్షాలు కురవడం అలాగే రోడ్లు దెబ్బతినడం వలన అధికారులు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. పహల్గామ్ మరియు బల్తాల్ మార్గాల్లో ప్రయాణించే భక్తుల రక్షణ కోసం ఈ తాత్కాలిక విరామం ప్రకటించారు.వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడం మరియు బ్రో సంస్థ రోడ్డు నిర్వహణ పనులు చేపట్టడం వల్ల యాత్రను ఆపేశారు. జులై మూడో తేదీన ప్రారంభమైన ఈ పవిత్ర యాత్రలో ఇప్పటివరకు నాలుగు లక్షల ఎనభై వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ యాత్రను తాత్కాలికంగా ఆపడం జరిగింది. సంప్రదాయ పహల్గామ్ మార్గం గుండా ఆగస్టు ఇరవై ఎనిమిదిన చడీ ముబారక్ ఊరేగింపు ఘనంగా జరగనుంది. ఈ ఊరేగింపుతో ఈ

## క్రీడాకారులతో మోడీ ఆత్మీయ ముచ్చట



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలతో దేశకీర్తిని విశ్వవ్యాప్తం చేసిన భారతీయ క్రీడాకారులతో ప్రధాని నరేంద్ర మోదీ ఆత్మీయంగా ముచ్చటించారు. విజేతలుగా నిలిచిన అథ్లెట్లను ఢిల్లీలోని తన అధికారిక నివాసానికి ఆహ్వానించిన ప్రధాని, వారి ప్రతిభను కొనియాడి అభినందనలు తెలిపారు. క్రీడల్లో సాధించిన విజయాలు కేవలం పతకాలకే పరిమితం కాకుండా, దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు. బాక్సింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన సాక్షి చౌదరి సహా పలువురు విజేతలు ప్రధానితో తమ అనుభవాలను పంచుకున్నారు. దేశ ప్రధాని తమను నేరుగా కలిసి అభినందించడం ఎంతో ఉత్సాహాన్ని, మరింత కష్టపడి ఆడాలనే పట్టుదలను పెంచిందని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు. 'ఆడినవాళ్లే రాణిస్తారు': దేశవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించాలని మోదీ పిలుపు క్రీడాకారులతో సంభాషణ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక సందేశాన్ని అందించారు. "మైదానంలోకి దిగి ఆడినవాళ్లే ప్రతిభను నిరూపించుకుని రాణిస్తారు" అని వ్యాఖ్యానించిన ప్రధాని, ప్రతీ ఒక్కరూ గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. దేశంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ వేదికపైనా 'చీర్ ఫర్ భారత్' (జష్ట్రవవతీ టశీతీ దీష్ఠుతీఖ్) నినాదంతో భారతీయ అథ్లెట్లకు నిరంతరం మద్దతుగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని ఇచ్చిన ఈ పిలుపు క్రీడా రంగానికి సరికొత్త ఉత్తేజాన్ని ఇవ్వడమే కాకుండా, రాబోయే అంతర్జాతీయ పోటీలకు క్రీడాకారులను సమాయత్తం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన' నమోదు గడువు పెంపు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు మరియు కరువు పరిస్థితుల్లో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన' నమోదు గడువును ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించింది. వ్యవసాయ రంగంలో అనిశ్చితిని తట్టుకుని రైతులకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతులకు మరింత సమయం – నష్ట పరిహారానికి ధీమా గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ బీమా నమోదు గడువు జూలై 31తో ముగిసింది. అయితే వర్షాభావ పరిస్థితులు, ఆలస్యంగా ప్రారంభమైన సాగు పనులు మరియు క్షేత్రస్థాయిలో సాంకేతిక కారణాల వల్ల ఇప్పటికీ లక్షలాది మంది రైతులు బీమా నమోదు చేసుకోలేకపోయారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఏ ఒక్క అర్హత ఉన్న రైతు కూడా పంట బీమా రక్షణకు దూరం కాకూడదనే ఉద్దేశంతో గడువును ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ అధికారులు నిర్ణయం

## మహిళా ఎస్ఐపై దాడి కేసు

### వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అరెస్ట్

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను ఏపీ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. చిలకపాలెం వద్ద రవిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఎస్ఐపై దాడి కేసులో అతను ఏ-1గా ఉన్నారు. పది రోజులుగా పోలీసులు కళ్లుగప్పి రవి తిరుగుతున్నాడు. గత నెల 30వ తేదీన మాజీమంత్రి అప్పలరాజు ములాఖత్ కోసం వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా భారీగా కార్యకర్తలతో జగన్‌కు స్వాగతం పాలకటానికి చింతాడ రవి వచ్చాడు. కొట్టారోడ్డు వద్ద బందోబస్తులో ఉన్న మహిళా ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించటంతో పాటు అసభ్యంగా రవి, అతని అనుచరులు వ్యవహరించారు. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ క్రమంలోనే చింతాడ రవితో పాటు 28 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నాడు. రవి కోసం విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలించారు. ఇవాళ సాయంత్రం 7 గంటల సమయంలో ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద చింతాడ రవికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సీతారామ నీళ్లను నిర్వాసితులకే అందించాలి

### బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార సాగు భూములకు ప్రాణాధారమైన సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లను ముందుగా స్థానిక భూ నిర్వాసితులకే మళ్లించాలని, స్థానిక అవసరాలు తీర్చకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ అన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో శనివారం జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ?గోదావరి జలాలు తమ పొలాలకు మళ్లుతాయనే ఆశతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేశారన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా గత రెండు నెలలుగా ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించకుండా నాగార్జునసాగర్ కాలువల్లోకి జలాలను తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి ఉన్న స్థానిక ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన తర్వాతే మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులపై నిజమైన ప్రేమ ఉంటే, తక్షణమే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ?సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కింద నిర్వాసితులైన రైతులకు ఎకరానికి రూ.21 లక్షల చొప్పున నిధులు కేటాయించి చెల్లించాలని, సాగునీరు అందక నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అవకాశం ఉన్న ప్రతి చెరువుకూ సీతారామ జలాలను తక్షణమే విడుదల చేయాలని, రాబోయే రబీ సీజన్ నాటికి జిల్లాలోని ప్రతి వ్యవసాయ భూమికీ సాగునీరు అందేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ?మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఎరువుల సబ్సిడీ రూపంలో లక్షల కోట్లు భరిస్తూ ఒక్కో బస్తాపై సుమారు రూ.2,000 వరకు వెసులుబాటు కల్పిస్తోందని తెలిపారు. అయితే, కనీసం బస్తాకు అయ్యే రూ.20 నుండి రూ.30 రవాణా ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించకపోవడం శోచనీయమని, ఆ రవాణా ఛార్జీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, మండల అధ్యక్షులు బుక్యా రమేష్, నాయకులు సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సిరిపురపు పుల్లారావు, బయ్యవరపు వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

## నేడు నర్సంపేటకు మాజీ సిఎం కెసిఆర్

### పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శ

**వరంగల్,** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు నర్సంపేటకు రానున్నారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కేసీఆర్ విషాదంలో మునిగిపోయారు. ఈ క్రమంలో తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఆయన నర్సంపేట రానున్నారు. ఈ మేరకు, ఆదివారం నాడు నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి బయలుదేరి వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా, ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులై వున్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్ట కాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో, నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం ఇవ్వనున్నారు. కాగా, పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్ గారు, ఇప్పటికే 2 కోట్ల 25 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం ప్రకటించారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరఫున రెండు కోట్ల 25 లక్షల రూపాయలలను అందజేయాలని నిర్ణయించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగానే సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. అలాగే పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర

### సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా

**భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర సాగుతుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా తెలిపారు. శనివారం బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చేరుకున్న యాత్రలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ దేశంలో ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించి మార్పు తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా యాత్రలో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రజలను దోచుకునే పాలన మారాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత, విద్యార్థులు చేపట్టిన ఉద్యమమే ప్రజా చైతన్యానికి నిదర్శనమన్నారు. మండలంలో ప్రతి ఏడాది గోదావరి వరదలతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండలాన్ని ముంపు నుంచి శాశ్వతంగా రక్షించేందుకు ఎత్తైన ప్రదేశాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి గిరిజన ఆదివాసీ రైతులకు హక్కులు కల్పించాలని, పోడు రైతులపై అటవీశాఖ అధికారులు నమోదు చేస్తున్న కేసులను ఉపసంహరించి రక్షణ కల్పించాలన్నారు. ఈ యాత్రలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణెళిష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయాల్లో సిపిఆర్ ఆవశ్యకం

### సిపిఆర్‌తో వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు

### కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ

**భద్రాద్రి కొత్తగూడెం** గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి అత్యవసర సమయంలో సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ అన్నారు. జీ.ఎం ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు శిక్షణ కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తిని గుర్తించడం, స్పందన, శ్వాసను పరిశీలించడం, అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం, ఛాతీపై కంప్రెషన్స్ చేయడం, అవసరమైన సందర్భాల్లో ఏఈడీ పరికరాన్ని వినియోగించడం వంటి అంశాలపై శిక్షకులు అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి, సరైన విధానాన్ని ఎంఆర్ఎస్ సిబ్బంది వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని, వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని శిక్షకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఇన్‌చార్జ్ ఎంఆర్ఎస్ అనంతరామయ్య, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ సి.హెచ్. సాగర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కె. సౌజన్యతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## మంగాపురం వద్ద వాచ్‌మెన్ దారుణ హత్య

### ఇంట్లోకి దూరి గొంతు కోసిన దుండగులు

**చిత్తూరు :** చిత్తూరు రూరల్ మండలం మంగాపురం వద్ద దారుణ హత్య కలకలం రేపింది. ఎన్ఆర్ఐ పట్టాభి నాయుడు ఇంటి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆనందరావు (50)ను గుర్తుతెలియని దుండగులు కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఇంటి అద్దాలను నాటుబాంబుతో పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు.. వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిత్తూరు డీఎస్పీ వెంకటనారాయణ
ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అసలు దుండగులు ఇంట్లోకి ఎందుకు చొరబడ్డారన్నది దర్యాప్తు చేస్తున్నారు. వాచ్‌మెన్ ఆనందరావును ఎందుకు హత్య చేయడం దొంగతనం కోసమే వచ్చారా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలను నిగ్గు తేల్చేందుకు ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు.

## చనిపోయిన ఏడాది తరవాత అస్తిపంజరం గుర్తింపు

### ఒంటరి మహిళ మృతిని గుర్తించని బంధువుల

**బెంగళూరు :** ఓ డూప్లెక్స్ ఇంట్లో మహిళ అస్థిపంజరం వెలుగుచూసిన సంఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని బాగలగుంటే ఏరియాకు చెందిన 52 ఏళ్ల దాక్షాయణి హవనూర్ లేఅవుట్‌లోని డూప్లెక్స్ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె భర్త ఉమేష్ 10 సంవత్సరాల క్రితం యాక్సిడెంట్‌లో చనిపోయాడు. కుమారుడు క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోయాడు. దాక్షాయణికి ఓ కూతురు ఉంది. ఆమెకు చాలా కాలం క్రితమే పె÷-లళైంది. ఒంటరిగా ఉంటున్న దాక్షాయణి సంవత్సరం క్రితం చనిపోయింది. ఈ ఏడాది కాలంలో కూతురు, అల్లుడు ఆ ఇంటికి రాకపోవటంతో దాక్షాయణి చనిపోయిన సంగతి బయటపడలేదు. సమాచారం అందుకున్న బాగలగుంటే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అస్థిపంజరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ మరణానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునే పనిలో పడ్డారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## బిజెపివి కార్మిక వ్యతిరేక విధానాలు

## 10న జిల్లా కేంద్రంలో ర్యాలీకి పిలుపు

### సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ

**రాజన్న సిరిసిల్ల, :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, కార్మిక చట్టాలు, హక్కులను పరిరక్షించుకోవాలని సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. ఆగస్టు 10న సోమవారం సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్, బీడీ, గ్రామపంచాయతీ, మున్సిపల్, ఆశా, అంగన్వాడీ, హమాలీ, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన, ఆసుపత్రి, గార్మెంట్ తదితర రంగాల కార్మికులు ఉదయం 10 గంటలకు కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అన్నల్దాస్ గణెళిష్, నాయకులు సిరిమల్ల సత్యం, దాసరి రూప, సందుపట్ల పోచమల్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడి మృతదేహంతో ఆందోళన

**బూర్గంపహాడ :** లారీ ప్రమాదంలో మృతి చెందిన ఐటీసీపీఎస్పీడీ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుడు గుగులోత్ శ్రీరామ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఐటీసీ గేటు వద్ద ఆందోళనకు దిగారు. విధులు ముగించుకుని వాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో ఐటీసీ సమీపంలో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే శ్రీరామ్ మృతిచెందాడు. యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న సర్పంచ్ గుగులోత్ కిషోర్నాయక్ ఐటీసీ గేటు వద్ద శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటానని, ఐటీసీ యాజమాన్యం న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఎపి కోసం తెలంగాణ నీళ్ల త్యాగం

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్

**హైదరాబాద :** కర్నాటక, తదితర రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జూరాలకు భారీగా వరద వస్తోందని , వచ్చిన నీళ్లను వచ్చినట్లే తెలంగాణ ప్రభుత్వం మొత్తం ఏపీకి వదిలేస్తుందని బీఆర్ఎస్మాజీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్ష మాట్లాడారు. ఏపీ ప్రభుత్వంతో తెలంగాణలోని రేవంత్ ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుని, తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీ టూర్లపై ఉన్న దృష్టి పాలమూరు రైతులపై లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వర్షాలతో వరద ప్రారంభమైన వెంటనే మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లల్లో నీళ్లను నింపి, రైతులకు సమయానికి నీళ్లను అందించేదని స్పష్టం చేశారు. జూరాలకు వరద వచ్చి పదిహేను రోజులైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రిజర్వాయర్లలో నీళ్లను నింపే ప్రయత్నం కూడా చేయలేదని దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ పనిచేస్తున్నది తెలంగాణ రైతుల కోసమా? పక్క రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసమా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరినో సంతృప్తి పరచడానికే రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

### 15 ఆగస్టున ప్రారంభించనున్న సిఎం

**నిజామాబాద** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

## బాబాయి మృతిని తట్టుకోలేక అబ్బాయి ఆత్మహత్య

**ఒంగోలు, :** ప్రకాశం జిల్లా కంభంలో తీవ్ర విషాదం ఘటన చోటుచేసుకుంది. బాబాయి మృతి చెందడాన్ని తట్టుకోలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాబాయి మణికుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న క్లైమ్ బాబు అనే యువకుడు.. తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధలోనే కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఒకే కుటుంబంలో వరుసగా ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మణికుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మణికుమార్ మృతి చెందారు. బాబాయి మృతి వార్త క్లైమ్ బాబును తీవ్రంగా కలిచివేసినట్లు తెలుస్తోంది. బాబాయితో ఉన్న అనుబంధం కారణంగా ఆయన మృతిని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన బాబు.. కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణికుమార్, ÷-లకైమ్ బాబు మృతదేహాలకు కుటుంబ సభ్యులు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి జరగడం చూసి స్థానికులు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ

# గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

- ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు.
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 09(జనసంఘర్షణ ):**

చర్ల మండలంలో, ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి వరదల వరలక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు మండల కేంద్రం విజయ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరదల వరలక్ష్మీ జెండా ఆవిష్కరణ చేశారు.అనంతరం బందెల చంటి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.సహజ వనరుల దోపిడీ కోసమే నూతన అటవీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసువచ్చిందన్నారు.అడవి, భూమి, నీటి పై ఆదివాసులకే హక్కు ఉండాలని డిమాండ్ చేశారు. కొమరం భీం స్ఫూర్తితో హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.(పపంచ వ్యాప్తంగా ఆదివాసులు హక్కుల కోసం పోరాడుతు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు మచ్చ రామారావు, ఐద్వా మండల కార్యదర్శి పొడుపుగంటి సమ్మక్కరైతు సంఘం మండల నాయకులు బి నవీన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల మహిళా కన్వీనర్ ఉడుగుల షారోను, కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొమురం భీమ్ విగ్రహా ఆవిష్కరణ

- ఆవిష్కరించిన పోదేం వీరయ్య అటవీశాఖ కార్పొరేషన్ చైర్మెన్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 09(జనసంఘర్షణ):**

చర్లలో విగ్రహా ఆవిష్కరణ,ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహాన్ని గౌరవ భద్రాచలం మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ సభ్యులు శాశ్వత ఆహ్వానితులు పొదెం వీరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ, ఆదివాసీ సమాజం యొక్క నిష్కల్మషమైన మనస్తత్వం, స్వచ్ఛమైన సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయత, మంచితనం దేశానికి ఎంతో గొప్ప ఆదర్శమని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండల ఆదివాసీ ప్రజలు సంప్రదాయబద్ధంగా మేళతాళాలు, ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో పొదెం వీరయ్య కి ఘన స్వాగతం పలికారు. కొమురం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆదివాసీ నాయకులు, సంఘాల ప్రతినిధుల ను,నిర్వాహకులను పొదెం వీరయ్య ప్రత్యేకంగా అభినందించారు. కొమురం భీమ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి ఆదివాసీ యువతకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఆదివాసి దినోత్సవాలు పాల్గొన్న మంత్రి సీతక్క

- ఆదివాసీ సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేయాలి
- కొమరం భీమ్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ముందుకు సాగాలి

**09.08.2026 - ఆదివారం జన సంఘర్షణ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రింగ్ రోడ్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా కొమరం భీమ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు పాల్గొనగా ఈ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజానికి ప్రత్యేకమైన జీవన విధానం సంస్కృతి సంప్రదాయాలు దేశానికి గొప్ప వారసత్వమని పేర్కొన్నారు. అడవిని తల్లిగా భావించి ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీల జీవన విధానం ఎంతో విశిష్టమైనదని అన్నారు అడవులు కొండలు వాగులు వనరులను కాపాడటంలో ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రకృతిని కాపాడుతూ తమ సంస్కృతిని తరతరాలకు అందిస్తున్న ఆదివాసీ సమాజాన్ని అభినందించారు. ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన కొమరం భీమ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. జల్ జంగల్ జమీన్ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు ప్రతి కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కోరారు. ఉన్నత విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై యువత దృష్టి పెట్టాలని సూచించారు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ విద్యా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివాసీ యువత పోటీ పరీక్షలకు సిద్ధమై ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు. మహిళలు విద్య ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఆదివాసీ మహిళలలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడాలని సూచించారు ఆరోగ్యంపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. పిల్లలకు పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చని అన్నారు తమకు ఉన్న హక్కులు ప్రభుత్వ పథకాల గురించి ప్రతి కుటుంబం తెలుసుకోవాలని సూచించారు భూమి అటవీ హక్కులు. ఉపాధి విద్య ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని పేర్కొన్నారు రోడ్లు తాగునీరు విద్యుత్ విద్య వైద్యం వంటి సౌకర్యాలు ప్రతి గ్రామానికి అందేలా ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆదివాసీ భాషలు కళలు నృత్యాలు జానపద సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.తమ సంస్కృతిని గౌరవించడంతో పాటు ఆధునిక సమాజంతో పోటీపడేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రకృతి సంపదను కాపాడుతూ జీవనోపాధిని మెరుగుపరుచుకునే మార్గాలను అన్వేషించాలని తెలిపారు అటవీ ఉత్పత్తులకు వినియోగించుకుంటూ యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ సమాజం తమ హక్కుల కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.చైతన్యం, విద్య, ఐక్యతతోనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి ఆదివాసీ కుటుంబం ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా బలోపేతం కావాలన్నారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి పనిచేస్తారని తెలిపారు. ఆదివాసీ దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండాలని అన్నారు. ప్రతి ఆదివాసీ కుటుంబంలో విద్య తో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కొమరం భీమ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆదివాసీ సమాజం ఐక్యతతో ముందుకు సాగి అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని ప్రముఖులు ఆకాంక్షించారు ఈ కార్యక్రమం ఆదివాసీ ప్రజల్లో చైతన్యం నింపడంతో పాటు విద్య ఆరోగ్యం ఉపాధి హక్కులపై కొత్త ఆలోచనలకు నాంది పలికింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఎమ్మార్వో దాసరి కిషోర్, మున్సిపల్ కమిషనర్ దిలీప్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు ,దేరంగుల ప్రసాద్, విజయ్ కుమార్ రెడ్డి, మండల ప్రెసిడెంట్ చిన్నంశెట్టి సత్యనారాయణ, మండల వైస్ ప్రెసిడెంట్ జల్లిపల్లి దేవరాజు, పాయం రామారావు, మడకం అదరయ్య పాల్గొన్నారు.




# ఆల్ పెన్షనర్స్ నాయకులు దివంగత నంద్యాల గంగారావుకి ఘన నివాళులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం, ఆగష్టు 09(జనసంఘర్షణ):**

భద్రాచలంలోని ఐటీడీఏ రోడ్డు కాలేజీ గ్రౌండ్ ప్రక్కన గోదావరి కన్వెన్షన్ హాల్ భద్రాచలం నందు దివంగత నంద్యాల గంగారావు పెద్దకర్మను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విశ్రాంత ఉద్యోగులు హాజరయ్యారు. అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు ఎం వి ఎస్ నారాయణ, మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఆల్ పెన్షనర్స్ అసోసియేషన లో ఉంటూ విశ్రాంత ఉద్యోగుల కోసం వారు కృషి సల్పిన విధానాన్ని వివరించారు. ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్. గౌరవ అధ్యక్షులు చంద్ర సుబ్బయ్య చౌదరి, కోశాధికారి డి కృష్ణమూర్తి, సహాయ కోశాధికారి నాళం సత్యనారాయణ, నాయకులు బన్సీలాల్, తాతోలు దుర్గాచారి , రాజలింగం,ఏ భాస్కరరావు, పురుషోత్తం, ఎన్ జగన్మోహనరావు, సూరిశెట్టి కృష్ణ, బెల్లంకొండ హనుమంతరావు, టి దాసు, తదితరులు హాజరయ్యారు.ముందుగా దివంగత విశ్రాంత నాయకులు నంద్యాల గంగారావు చిత్రపటానికి అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్ డి కృష్ణమూర్తి సుబ్బయ్య చౌదరి తదితరులు పూలమాల వేసి పూలు చల్లి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి బంధువులు, కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు తదితరులు హాజరయ్యారు.



# ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం, ఆగష్టు 09(జనసంఘర్షణ):**

దుమ్ముగూడెం మండలంలో పురస్కరించుకుని దుమ్ముగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఆదివాసీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో జెండా ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.




**వేడుకల ముఖ్యాంశాలు**

జెండా ఆవిష్కరణ లక్ష్మినగరం, ములకపాడు చౌరస్తా లో కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీ సంఘం నాయకులు జెండా ఆవిష్కరించి నివాళు లర్పించారు.తదనంతరం హక్కుల పరిరక్షణ అడవిని, ప్రకృతిని కాపాడుతున్న ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు,వారి హక్కుల పరిరక్షణ గురించి చర్చించారు. ప్రభుత్వ డిమాండ్లు విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక వసతులు కల్పించాలని, చట్టాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

# ఈరోజు కోటగిరిలో బీఆర్ఎస్ శ్రేణుల సందడి!

- మరిగమ్మ ఆలయం వద్దకు బాన్సువాడ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు.. నాయకులు, కార్యకర్తలకు పిలుపు



**కోటగిరి,/ ఆగస్టు 9:/(జన సంఘర్షణ)**

కోటగిరి మండల కేంద్రంలో ఈరోజు బీఆర్ఎస్ శ్రేణులు సందడి చేయనున్నాయి. బాన్సువాడకు చెందిన బీఆర్ఎస్ నాయకులు జుబేర్ అన్నగారితో పాటు పలువురు ముఖ్య నాయకులు ఆదివారం సాయంత్రం 5 గంటలకు కోటగిరి మరిగమ్మ ఆలయం వద్దకు రానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ నేపథ్యంలో కోటగిరి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో మరిగమ్మ ఆలయం వద్దకు చేరుకోవాలని పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న ప్రతి నాయకుడు, కార్యకర్త కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**శ్రేణులంతా ఏకతాటిపైకి.....**

పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. “నాయకత్వం వస్తోంది.. శ్రేణులు కదలాలి.. ఐక్యతతో ముందుకు సాగాలి” అంటూ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సమయం: సాయంత్రం 5 గంటలకు

వేదిక: కోటగిరి మండల కేంద్రంలోని మరిగమ్మ ఆలయం ఇట్లు మీకోటగిరి బీఆర్ఎస్ పార్టీ యువసేన తేల రవికుమార్ , బీర్పూర్ సర్పంచ్ ధర్మ తేజ, పొతంగల్ అధ్యక్షుడు సుద్దాం నవీన్, మాజీ ఏఈ కిషన్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# మందర్నా మంజీరలో ఇసుక మాఫియా హల్‌చల్!”

- సెలవు దినాలు వచ్చాయంటే చాలు.. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా?....
- అధికారులారా.. ఇకనైనా మేల్కొనండి! అక్రమ రవాణాదారులపై ఉక్కుపాదం మోపాలి...

**సాలూరు,/ ఆగస్టు 9:/(జన సంఘర్షణ)**

మందర్నా మంజీర పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వరుసగా సెలవుదినాలు రావడంతో అక్రమ ఇసుక రవాణాదారులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలవు రోజుల్లో అధికారుల పర్యవేక్షణ తగ్గుతోందనే ధీమాతోనే అక్రమ రవాణాదారులు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి. మంజీర నుంచి ఇసుకను తరలించడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, నది పరిసర ప్రాంతాలపై పర్యావరణ ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





**అధికారులారా.. చర్యలు ఎప్పుడు?....**

మందర్నా మంజీరలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు తక్షణమే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాహనాలను తనిఖీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వారిని గుర్తించి, వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. “ఇసుక మాఫియాకు అడ్డుకట్ట..వేయకపోతే మంజీరను కాపాడటం కష్టమే” అని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెట్టాలని, లేదంటే ప్రభుత్వ ఆదాయానికి నష్టం, సహజ వనరుల దోపిడీ కొనసాగుతూనే ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం — తెలుగు దినపత్రిక
సోమవారం
10 ఆగస్టు 2026

# మద్యం దుకాణాలపై నిఘా ఏది..?

- ఎంఆర్‌పీ ఉల్లంఘనలపై ఫిర్యాదుల వెల్లువ..
- అబ్కారీ శాఖ తనిఖీల లెక్కలు బయటపెట్టాలి

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

కారేపల్లి మండలంలో మద్యం విక్రయాలపై వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులు ఇప్పుడు అబ్కారీ శాఖ పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. మద్యం దుకాణాల్లో నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు, గ్రామీణ ప్రాంతాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు తరచూ వినిపిస్తున్నా.. అధికారులు చేపడుతున్న తనిఖీలు, చర్యల వివరాలు మాత్రం ప్రజలకు స్పష్టంగా తెలియడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించడం అధికారుల బాధ్యత. ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అవాస్తవమైతే అధికారికంగా ఖండించి ప్రజలకు వాస్తవ పరిస్థితిని తెలియజేయాలి. కానీ ఈ రెండింటిలో ఏది జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.


**ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూళ్లు నిజమేనా..?**

కొన్ని మద్యం విక్రయ కేంద్రాల్లో సీసాపై నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారా..? తనిఖీల్లో ఉల్లంఘనలు గుర్తించారా..? గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాల్సిన అవసరం ఉంది. "అధిక ధరలపై ఫిర్యాదులు వస్తుంటే తనిఖీల్లో అవి ఎందుకు కనిపించడం లేదు?" అన్న ప్రశ్న వినియోగదారుల నుంచి వస్తోంది.

**వాహనాల ద్వారా మద్యం తరలింపుపై చర్యలెక్కడ?**

మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వాహనాల ద్వారా మద్యం తరలిస్తున్నారన్న ఫిర్యాదులు కూడా అధికారుల దృష్టికి వెళ్లినట్లు ప్రజలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అబ్కారీ శాఖ ఎన్ని వాహనాలను తనిఖీ చేసింది..? ఎన్ని కేసులు నమోదు చేసింది..? ఎవరిపైనైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నదా..? అనే వివరాలను అధికారులు వెల్లడించాలి. ఆరోపణలు నిరాధారమైతే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా చెప్పాలి. లేదంటే ప్రజల్లో అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉంది.





**బెల్ట్ దుకాణాలపై ప్రత్యేక నిఘా అవసరం**

గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, నివాస ప్రాంతాలకు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ విక్రయాలు లేవని అధికారులు భావిస్తే.. గ్రామాల వారీగా నిర్వహించిన తనిఖీల వివరాలను వెల్లడించడం ద్వారా ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయవచ్చని పలువురు అంటున్నారు.

**రికార్డులు బయటపెట్టండి.. ప్రజలకు సమాధానం చెప్పండి**

కారేపల్లి మండల పరిధిలో గత నెల రోజులుగా ఎన్ని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు..? ఎన్ని ఉల్లంఘనలు గుర్తించారు..? ఎన్ని కేసులు నమోదు చేశారు..? ఎంతమేర జరిమానాలు విధించారు..? ఎన్ని వాహనాలను తనిఖీ చేశారు..? అనధికారిక మద్యం విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? ఈ వివరాలను అబ్కారీ శాఖ అధికారులు బహిరంగంగా వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

**మౌనం వీడాల్సిన సమయం ఇదే..**


ప్రజా ఫిర్యాదులపై అధికారులు స్పందించకపోతే సమస్య పరిష్కారం కాకపోగా అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే ఆరోపణలను తేలికగా తీసుకోకుండా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంఆర్‌పీ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలి.. ఆరోపణలు అవాస్తవమైతే ప్రజలకు వాస్తవాలను చెప్పాలి. అబ్కారీ శాఖ ఇకనైనా స్పందించి కారేపల్లి మండలంలో నిర్వహించిన తనిఖీలు, నమోదైన కేసులు, తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలు వెల్లడిస్తుందా..? లేక ప్రజలు ఆందోళనకు దిగే పరిస్థితి వచ్చే వరకు వేచి చూస్తుందా..? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రేకుల షెడ్ ధ్వంసం.. దాడి చేశారంటూ ఫిర్యాదు

- స్థల వివాదమే కారణమా?
- రూ.లక్ష డిమాండ్ చేశారంటూ బాధితుడి ఆరోపణ
- తనకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందంటూ బోధన్ రూరల్ పోలీసులను ఆశ్రయించిన ఆనంద్

సాలూరు,/ ఆగస్టు 9:/(జన సంఘర్షణ)

తాను కొనుగోలు చేసిన స్థలంలో నిర్మించుకున్న రేకుల షెడ్‌ను ధ్వంసం చేయడంతో పాటు తనపై, కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సాలూరు గ్రామానికి చెందిన ఆలేవర్ ఆనంద్ బోధన్ రూరల్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం....సాలూరు శివారులోని సర్వే నంబర్ 1962లో 242 చదరపు గజాల స్థలాన్ని రిజిస్టర్ సేల్ డీడ్ నంబర్ 2252/2023 ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ అనుమతులతో అక్కడ రేకుల షెడ్ నిర్మాణంతో పాటు ఫ్లోరింగ్ టైల్స్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 8న సాలూరు గ్రామ సర్పంచ్ భర్త సోలం రవి, ఉప సర్పంచ్ సురేష్ పటేల్, డిస్కో సాయిలు, వార్డు సభ్యులు జాఫర్, కల్లూరి బాసిర్, గైని అరవింద్, బగం శ్రీకాంత్ తదితరులు గుంపుగా వచ్చి తన స్థలంలోకి ప్రవేశించి రేకులు, ఫ్లోరింగ్ టైల్స్ ధ్వంసం చేశారని ఆనంద్ ఆరోపించారు. అంతేకాకుండా తనను, కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.





**రూ.లక్ష డిమాండ్ చేశారంటూ ఆరోపణ...**

ఓ వ్యక్తి తనను రూ.లక్ష డబ్బులు డిమాండ్ చేశారని, ఆ మొత్తాన్ని ఇవ్వడానికి నిరాకరించడంతోనే దాడికి పాల్పడ్డారని ఆనంద్ ఆరోపించారు. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. స్థల వివాదంపై గతంలోనే గ్రామ పంచాయతీకి లీగల్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

**"మాకు రక్షణ కల్పించండి"...**

ఈ ఘటనతో తమ కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, తమకు ప్రాణహాని ఉందని ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆయన పోలీసులను కోరారు. కాగా, ఈ ఆరోపణలపై సంబంధిత మరో వర్గం స్పందన తెలియాల్సి ఉంది. పోలీసులు విచారణ అనంతరం వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

# ప్రజల సమస్యకు తక్షణ పరిష్కారం..

- సర్పంచ్ చొరవకు అభినందనలు
- నాలుగు రోజులుగా తాగునీటి ఇబ్బందులు..
- వెంటనే స్పందించి మోటార్ రిపేర్ చేయించిన ఎత్తొండ సర్పంచ్

కోటగిరి, /ఆగస్టు 9: /(జన సంఘర్షణ)

కోటగిరి మండలం ఎత్తొండ గ్రామంలోని 10వ వార్డులో గత నాలుగు రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ తక్షణ ఉపశమనం కల్పించారు. వార్డులో తాగునీటి సమస్య నెలకొన్న విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ వెంటనే స్పందించి బోరు మెకానిక్‌ను పిలిపించారు. బోరు మోటార్‌లో ఏర్పడిన సమస్యను వెంటనే మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో నాలుగు రోజులుగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్న 10వ వార్డు ప్రజలకు ఊరట లభించింది. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా... భావించి, సమస్యలను తెలుసుకున్న వెంటనే స్పందించి పరిష్కరించడం ప్రజాప్రతినిధుల బాధ్యతకు నిదర్శనమని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో తక్షణమే స్పందించిన సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్‌ను ఎత్తొండ గ్రామ ప్రజలు అభినందిస్తూ, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇలాంటి తక్షణ స్పందన ప్రతి ప్రజాప్రతినిధికి ఆదర్శంగా నిలవాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.






# గుడిసెల మాటున పేకాట జోరు..

- అధికారుల దృష్టికి ఎప్పుడు?
- హంగర్గ ఫారం నం.4 దారిలో పేకాట స్థావరం?
- నిజామాబాద్ 'చీతా' టీం మెరుపు దాడులు చేసినా.. ఆగని పేకాట!
- ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలంటున్న స్థానికులు

పోతంగల్), ఆగస్టు 9/(జన సంఘర్షణ):




నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని హంగర్గ ఫారం నంబర్ 4 వైపు వెళ్లే పంట పొలాల దారిలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని పేకాట నిర్వహిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పంట పొలాలకు వెళ్లే మార్గాన్ని ఆనుకుని గుడిసెల్లో పేకాటకు అడ్డాగా మార్చుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో పేకాట నిర్వహణపై ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నిజామాబాద్ 'చీతా' టీం గతంలో మెరుపు దాడులు నిర్వహించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే దాడులు జరిగినప్పటికీ పేకాట కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోలేదని, మళ్లీ యథావిధిగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




**దాడులు సరే.. శాశ్వతంగా అడ్డుకట్ట ఎప్పుడు?**

పోలీసులు ఒకసారి దాడులు చేసి కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా, పేకాట నిర్వహణకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి నిరంతర నిఘా, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పేకాట వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు యువత చెడు వ్యసనాలకు గురయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం నం.4 పరిసరాల్లో పేకాట స్థావరాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో దాడులు జరిగినా మళ్లీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలపై లోతుగా పరిశీలించి, నిజం తేలితే నిర్వాహకులు, సహకరిస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**"ఒక్కసారి దాడులతో సరిపెట్టకుండా..**

పేకాటకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలి" అంటూ ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# పోచారం తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు.. సంప్రదాయ దుస్తుల్లో అలరించిన మహిళలు, యువతులు

బాన్సువాడ, ఆగస్టు 9 (జన సంఘర్షణ)



బాన్సువాడ మండలంలోని పోచారం తండాలో తీజ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తండా ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. తీజ్ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన శోభాయాత్ర తండా వీధుల్లో ఉత్సాహంగా సాగింది. మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొనడంతో తండాలో పండుగ సందడి నెలకొంది. యువతుల నృత్యాలు, సంప్రదాయ కార్యక్రమాలతో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ప్రముఖ వ్యాపారవేత్త మోరల్ శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జూబెర్, సీనియర్ నాయకులు అంజిరెడ్డి, బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ తదితరులు హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. వారితో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తండా పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తీజ్ పండుగ బంజారా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన పోచారం తండా ప్రజలకు అభినందనలు తెలిపారు. తండా ప్రజల ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణకు తీజ్ ఉత్సవాలు ప్రతీకగా నిలిచాయని పలువురు పేర్కొన్నారు.

# ఇంద్ర నారాయణ ఆలయాన్ని చారిత్రక కట్టడంగా పరిరక్షించాలి

- ప్రాచీన ఆలయ వైభవాన్ని కాపాడాలి..
- చత్రపతి యువజన సంఘం డిమాండ్







బోధన్/ఆగస్టు 9:/జన సంఘర్షణ) ప్రాచీన చరిత్ర, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్న ఇంద్ర నారాయణ ఆలయాన్ని చారిత్రక కట్టడంగా గుర్తించి పరిరక్షించాలని చత్రపతి యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆలయ ప్రాశస్త్యాన్ని భావితరాలకు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఇంద్ర నారాయణ ఆలయం కేవలం ఆధ్యాత్మిక ప్రదేశం మాత్రమే కాకుండా, ప్రాంత చరిత్రకు అద్దం పట్టే విలువైన వారసత్వ సంపదగా ఉందని సంఘం నాయకులు పేర్కొన్నారు. కాలక్రమేణా పురాతన కట్టడాలు నిర్లక్ష్యానికి గురికాకుండా వాటి పరిరక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఆలయ నిర్మాణ శైలి, చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పురావస్తు శాఖ అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలని సూచించారు. ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయడంతో పాటు, ప్రాచీన కట్టడం అసలు రూపం దెబ్బతినకుండా శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు. “చరిత్రను కాపాడుకోవడం అంటే మన మూలాలను, మన సంస్కృతిని కాపాడుకోవడమే. ఇంద్ర నారాయణ ఆలయాన్ని పరిరక్షిస్తే రాబోయే తరాలకు మన ప్రాంత చారిత్రక వైభవాన్ని అందించినట్లవుతుంది” అని చత్రపతి యువజన సంఘం అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాస్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం, పురావస్తు శాఖ స్పందించి ఆలయ పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

# “మరిగమ్మ పండుగకు రూ.25 వేల ఆర్థిక సహాయం

- అమ్మవారి సేవలో బీఆర్ఎస్ నాయకులు.. అన్నదమ్ముల అనుబంధం, తెల్ల అరవింద్ కుమార్, తెల్ల రవికుమార్ సోదరులకు సేవాభావానికి ఆలయ కమిటీ అభినందనలు...




కోటగిరి,/ ఆగస్టు 9: /(జన సంఘర్షణ) కోటగిరి మండల కేంద్రంలోని మరిగమ్మ ఆలయ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్





మండల నాయకులు, యువసేన సభ్యులు, మరిగమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**పండుగ నిర్వహణకు చేయూత....**

మరిగమ్మ అమ్మవారి పండుగ నిర్వహణకు సొసైటీ డైరెక్టర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్ల అరవింద్ కుమార్, బీఆర్ఎస్ మండల నాయకులు తెల్ల రవికుమార్ సోదరులు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే పీఏసీఎస్ డైరెక్టర్ కోటగిరి, బీఆర్ఎస్ నాయకులు, యువసేన సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని పండుగ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**సేవాభావాన్ని అభినందించిన ఆలయ కమిటీ....**

మరిగమ్మ అమ్మవారి పండుగ నిర్వహణకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన తెల్ల అరవింద్ కుమార్, తెల్ల రవికుమార్ సోదరులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పండుగల సమయంలో ఆలయాలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి సేవకు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం ద్వారా సోదరులు తమ భక్తిభావంతో పాటు సేవాస్ఫూర్తిని చాటుకున్నారని పలువురు కొనియాడారు.

**అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష....**

తెల్ల అరవింద్ కుమార్, తెల్ల రవికుమార్ సోదరులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, మరిగమ్మ అమ్మవారి ఆశీస్సులు వారిపై ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. “ఆలయ పండుగలకు అండగా నిలవడం.. సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలి” అని పలువురు పేర్కొన్నారు.

# 4 నెలలుగా వీక్లీ ఆఫ్ లేకపోవడం.. వేధింపుల ఆరోపణలు

- మహిళ ఆత్మహత్యతో కలకలం.. ఉద్యోగుల హక్కులపై మళ్లీ ప్రశ్నలు
- సంస్థల్లో వేధింపులపై అధికారులు కఠినంగా స్పందించాలి: ప్రజల డిమాండ్

మైసూరు/ఆగస్టు 9/(జన సంఘర్షణ) మైసూరు: నాలుగు నెలలుగా వారాంతపు సెలవు లేకుండా పనిచేయించడం, ఉద్యోగ ప్రదేశంలో వేధింపులకు గురిచేశారనే ఆరోపణల నేపథ్యంలో నాగేశ్వరి అనే మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మైసూరులో విషాదాన్ని నింపింది. ఓ ప్రైవేట్ కంపెనీ ఉత్పత్తుల ప్రమోటర్‌గా పనిచేస్తున్న ఆమె రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో పలు కీలక విషయాలను ప్రస్తావించినట్లు సమాచారం. తనను లక్ష్యంగా చేసుకొని పైఅధికారులు వేధించారని, నాలుగు నెలలుగా వారాంతపు సెలవులు ఇవ్వలేదని ఆమె లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, తన పట్ల వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించినందుకు ఉద్యోగం నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

**ఉద్యోగులపై ఒత్తిడి ఎంతవరకు న్యాయం?**

ఒక ఉద్యోగి తన హక్కుల గురించి ప్రశ్నిస్తే వేధింపులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటే అది ఆందోళనకర పరిణామమని ప్రజలు విమర్శిస్తున్నారు. పని ఒత్తిడి పేరుతో ఉద్యోగుల మానసిక వేదనను పట్టించుకోకుండా వ్యవహరించడం సరికాదని అంటున్నారు.

**అధికారులారా.. ఇకనైనా మేల్కొనండి!**

ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలుగులోకి తేవాలని, సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగుల పని గంటలు, వారాంతపు సెలవులు, కార్యాలయ వేధింపులపై నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం



ఉందని సూచిస్తున్నారు. ఒక ఉద్యోగి ప్రాణం కోల్పోయిన తర్వాత స్పందించడం కాదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకముందే అధికారులు మేల్కొని, ఉద్యోగుల హక్కులు మరియు భద్రతకు భరోసా కల్పించాలి.


# ఇంకెన్ని రోజులు ఈ గుంతల రోడ్డు?...

- ఎత్తొండ-బోధన్ రహదారిపై ప్రజల ఆగ్రహం.. ఏడాది గడిచినా మారని పరిస్థితి
- గుంతల్లో మొరం పోయడం కాదు.. శాశ్వత రోడ్డు నిర్మించాలి: ప్రజల డిమాండ్

కోటగిరి /ఎత్తొండ,/ ఆగస్టు 9:/(జన సంఘర్షణ) ఎత్తొండ గ్రామం నుంచి బోధన్ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారినా అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది క్రితం ఇదే గుంతలు.. అప్పుడూ ఇదే సమస్య.. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి! అప్పట్లో రహదారి సమస్యపై రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చ జరిగినప్పటికీ, ఏడాది గడిచినా రోడ్డు పరిస్థితిలో మాత్రం చెప్పుకోదగ్గ మార్పు కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గుంతలు ఏర్పడిన ప్రతిసారి వాటిలో మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. అయితే చిన్నపాటి వర్షం కురిసినా మొరం కొట్టుకుపోయి మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ నిధులు తాత్కాలిక పనులకే ఖర్చవుతున్నాయే తప్ప ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఓట్ల సమయంలో గుర్తొచ్చే ప్రజలు.. సమస్యల సమయంలో ఎందుకు కనిపించరు? ఎన్నికల సమయంలో ప్రతి ఇంటి తలుపు తట్టి ఓట్లు అడిగే నాయకులకు ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న రహదారి సమస్య ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు కావాల్సింది హామీలు కాదు.. సురక్షితమైన ప్రయాణం. ఫొటోలు మారుతున్నాయి.. కానీ గుంతలు మాత్రం అవే! సమస్యపై ప్రకటనలు వస్తున్నాయి.. పరిష్కారం మాత్రం రావడం లేదు!

**ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే!....**

1గుంతల్లో మొరం పోయడమేనా శాశ్వత పరిష్కారం?
2 వాహనదారుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారు?
3 ఏడాది గడిచినా రహదారికి శాశ్వత మరమ్మతులు ఎందుకు చేపట్టడం లేదు?....
4మరో ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూస్తారా?
5ప్రజలు ఇంకెన్ని రోజులు ఈ దుస్థితిని భరించాలి?
6ఇకనైనా అధికారులు,.... 7ప్రజాప్రతినిధులు స్పందించి... ఎత్తొండ--బోధన్ రహదారిని పూర్తిస్థాయిలో పరిశీలించి, గుంతలను తాత్కాలికంగా పూడ్చడం కాకుండా నాణ్యమైన శాశ్వత రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇది కేవలం రోడ్డు సమస్య కాదు.. ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన విషయం. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు చేపట్టకపోతే ప్రజల నుంచి మరింత తీవ్ర స్థాయిలో




నిరసనలు, ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.
ఇంకెన్ని రోజులు?.. ఇంకెన్ని సంవత్సరాలు? ఇంకెన్ని ప్రమాదాలు జరిగితే శాశ్వత పరిష్కారం చూపిస్తారు?...ప్రజల ప్రశ్నకు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది! ఎత్తొండ గ్రామం పేర్కొన్నారు.

# కామారెడ్డి సర్క్యులర్ స్మార్ట్ క్లస్టర్ నిర్మాణానికి లింగంపల్లిలో శ్రీకారం

- సర్పంచ్ టేక్రియాల లావణ్య రమేష్ ఆధ్వర్యంలో
- వి హెల్ ది ఎర్త్ ప్లానెట్ రన్స్, ఆగ్రో టూరిజం ఉద్యమం
- కామారెడ్డి సర్క్యులర్ స్మార్ట్ క్లస్టర్ నిర్మాణానికి లింగంపల్లి, కరడ్ పల్లి లో శ్రీకారం

కామారెడ్డి జిల్లా : ఆగస్టు 9 (జనసంఘర్షణ) ప్రతినిధి లింగంపల్లి, కరడ్ పల్లి గ్రామాలలో కామారెడ్డి వి హెల్ ది ఎర్త్ ప్లానెట్ రన్స్ ఆగ్రో టూరిజం ఉద్యమాలకు అధికారకంగా శ్రీకారం చుట్టారు గ్రామ సర్పంచ్, రైతులు, విద్యార్థులు, యువత, వ్యాపారవేత్తలు, ఐ ఐ టియన్స్ బిజినెస్ భాగస్వాములు మరియు వివిధ రంగాల నిపుణులు కలిసి స్థిరమైన గ్రామీణ అభివృద్ధి కోసం తమ భాగస్వామ్యాన్ని ప్రకటించారు
ఈ కార్యక్రమం ద్వారా కామారెడ్డిసర్క్యులర్ స్మార్ట్ క్లస్టర్ అభివృద్ధికి కమ్యూనిటీ ఆధారిత ప్రయాణం ప్రారంభమైందనీ ఇందులో ఆగ్రో టూరిజం, ఎం ఎస్ ఎం ఈ అభివృద్ధి, వృత్తి విద్య, సుస్థిర వ్యాపారం, సాంకేతిక మరియు గ్రామీణ పారిశ్రామికవేత్తల అభివృద్ధి ప్రధాన అంశాలని అన్నారు ఈ కార్యక్రమాన్ని స్థానికంగా శ్రీ సమ్మిరెడ్డి శ్రీ శివ కోటి రామ్ గ్రామ సర్పంచ్ బేగియాలలో లావణ్య రమేష్ మరియు కరడ్ పల్లి సర్పంచ్ సంజీవ్ మాధవపల్లి సర్పంచ్ నాగేశ్వరరావు బొంపల్లి సర్పంచ్ శ్రీనివాస్ బూర్గుల్ సర్పంచ్ సౌమ్య మోహన్ గోపి ప్రాజెక్టు భాగస్వాములతో కలిసి సమన్వయం చేశారు.

**గ్రామం నుంచి భవిష్యత్తు వైపు :** గ్రామీణ యువత కొత్త అవకాశాలు కల్పించడంలో యు డబ్ల్యూ వి సి యునైటెడ్ వరల్డ్ వొకేషనల్ కాలేజ్ కీలక భాగస్వామిగా ఉండనుందని అన్నారు






డి. వాక్ - బి. వాక్ - ఎం.వాక్ విద్యతో పాటు ప్రాక్టికల్ అనుభవం పరిశ్రమలతో అనుసంధానం, హెర్ను విల్ యు లెర్న్ విధానంపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల యువత ముందుకు రావాలని కోరారు

**45 రోజుల ఏఐ చాలెంజ్ :** గ్రామీణ విద్యార్థులకు 45 రోజుల ఏ చాలెంజ్ లో పాల్గొని తమ గ్రామంలోని వాస్తవ సమస్యలను ఏఐ మరియు ఆధునిక సాంకేతిక సహాయంతో గుర్తించి వాటిని ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించే అవకాశాలు పొందుతారని అన్నారు

**గ్రామీణ భారతదేశంలో టెక్నాలజీ:** కామారెడ్డి విద్యార్థులకు కొత్త అవకాశాలు కామారెడ్డి మరియు పరిసర గ్రామాల విద్యార్థులకు యు డబ్ల్యూ విసి చేరేందుకు ఆహ్వానం పలికారు
ప్రాక్టికల్ విద్య పరిశ్రమల అనుభవం ఇంటర్నల్ సిప్ల నైపుణ్యాభివృద్ధి మరియు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశాలతో పాటు నేర్చుకుంటూ సంపాదించే విధానంపై దృష్టి పెట్టాలన్నారు అభివృద్ధి 3 బలాలు ఈ ఉద్యమం ఒక సరళమైన ఆలోచనపై ఆధారపడి ఉందని ప్రజల భాగస్వామ్యం ఆలోచనలు వనరులు, కమ్యూనిటీ శక్తిని అందిస్తారని
విద్య జ్ఞానం సాంకేతిక నిపుణుల సహకారాన్ని అందిస్తామని పెట్టుబడులు మార్కెట్లు సాంకేతిక ఉపాధి, వ్యాపార విస్తరణ అవకాశాలను తీసుకువస్తాయని మూడు వర్గాలు కలిసి పనిచేస్తే రైతులు యువత మహిళలు వ్యాపారవేత్తలు, గ్రామీణ కుటుంబాలు అభివృద్ధిలో భాగస్వాములుగా వారే సర్కులర్ రూరల్ ఎకోనమీ నిర్మించవచ్చని తెలిపారు. అలాగే ఫ్యూచర్ అగ్రికల్చర్ మరియు ఎనేబుల్ అగ్రికల్చర్ కమాండ్ సెంటర్ కు సంబంధించిన డిమాండ్ ప్రదర్శించారు రైతుల కోసం ఏఐ డేటా ప్రెసిషన్ అగ్రికల్చర్ మరియు స్థానిక వ్యవసాయ జ్ఞానాన్ని ఎలా కలిపి ఉపయోగించవచ్చో వివరించారు. కార్యక్రమం అనంతరం బృందం స్థానిక దేవాలయాన్ని సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడి కామారెడ్డి వైపు పలు గ్రామాలు భూములను సందర్శించి వెళ్లారు ఈ బృందంలో ఏడుగురు ఐఐఈ ట్రైనర్స్. ఐదుగురు బిజినెస్ పార్టనర్స్, పదిమంది ఎంటర్ప్రెన్యూర్స్, ఆర్గానిక్ ఫార్మింగ్ నిపుణులు, స్కిల్స్ డెవలప్మెంట్ మరియు ఒకేషనల్ ట్రైనర్స్,పలు గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు వార్డు సభ్యులు పలు గ్రామాల ప్రజలు యువత ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్లాబ్ పెచ్చులు.. తేలిన చువ్వలు.. బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు!

- “ఏదైనా జరిగితే బాధ్యత ఎవరిది?”.. అధికారుల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం
- ప్రమాదం అంచున పాత పాతంగల్ పాఠశాల.. బిక్కుబిక్కుమంటున్న 25 మంది చిన్నారులు
- “ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?”.. అధికారులను ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు.....

పోతంగల్,/ ఆగస్టు 9:/(జన సంఘర్షణ)

చిన్నారులు చదువుకోవాల్సిన పాఠశాల.. ఇప్పుడు భయంతో అడుగుపెట్టాల్సిన పరిస్థితిగా మారింది. పాత పాతంగల్ ప్రభుత్వ పాఠశాలలో స్లాబు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు తేలిపోయాయి. పైకప్పు పరిస్థితి చూస్తే ఎప్పుడు ఏ పెచ్చు ఊడి పడుతుందో తెలియని దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనల మధ్యనే విధులు, చదువులు కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 25 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఒక్క గదిలోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు గదుల కొరత.. మరోవైపు శిథిలమైన పైకప్పులు.. వెరసి చిన్నారుల చదువుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**బడా.. బడిలో భయమా?....**






విద్యార్థుల తలపై రక్షణగా ఉండాల్సిన స్లాబే ఇప్పుడు ప్రమాదకరంగా మారింది. పైకప్పు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు స్పందించడం కంటే.. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**అధికారులారా.. ఇకనైనా మేల్కొనండి!......**

పాఠశాల భవనాన్ని వెంటనే పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న భాగాలకు మరమ్మతులు చేపట్టాలని, విద్యార్థులకు సరిపడా కొత్త తరగతి గదులు నిర్మించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.“మా పిల్లలను చదువుకోవడానికి బడికి పంపుతున్నాం.. భయంతో తిరిగి రావాలని కాదు. మా పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?” అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**చిన్నారుల భద్రత విషయంలో “చూద్దాం.. చేస్తాం”**

అనే ధోరణి కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత విచారం వ్యక్తం చేయడం కంటే.. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే అధికారుల బాధ్యత అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# శ్రావణంలో 5 శుక్రవారాలు.. వరలక్ష్మీ వ్రతం ఎప్పుడు చేయాలి?

- శాస్త్రం చెప్పేది ఇదే!

హైదరాబాద్/ఆగస్టు 9/(జన సంఘర్షణ)

శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడంతో వరలక్ష్మీ వ్రతం ఏ తేదీన ఆచరించాలనే సందేహం చాలామందిలో నెలకొంది. శాస్త్ర నియమాలు, పండితుల అభిప్రాయం, శృంగేరి సంప్రదాయం ప్రకారం ఈ ఏడాది వరలక్ష్మీ వ్రతం ఎప్పుడు చేయాలో పూర్తి వివరాలు తెలుసుకోండి. శ్రావణ మాసం అంటే హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన కాలం. ఈ నెలలో ప్రతి శుక్రవారం మహాలక్ష్మీ ఆరాధనకు విశేష ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా సుమంగళి స్త్రీలు కుటుంబ సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరోగ్యం, సంతానాభివృద్ధి కోసం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే పర్వదినం శ్రీ వరలక్ష్మీ వ్రతం. అయితే ఈ ఏడాది శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడంతో వరలక్ష్మీ వ్రతం ఏ తేదీన చేయాలనే సందేహం చాలామందిలో నెలకొంది. శాస్త్రాలు ఏమి చెబుతున్నాయి? పండితుల అభిప్రాయం ఏమిటి? తెలుసుకుందాం.

**వరలక్ష్మీ వ్రతం ఎందుకు ప్రత్యేకం?”**

వరాలను ప్రసాదించే మహాలక్ష్మీదేవిని “వరలక్ష్మి”గా పూజించే ఈ వ్రతం సనాతన సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ రోజున మహిళలు కలశంలో లక్ష్మీదేవిని ఆవాహన చేసి, షోడశోపచార పూజ, అష్టోత్తర శతనామార్చన, తోరపూజ, తాంబూల సమర్పణ, ముత్తైదువులకు వాయనాలు ఇవ్వడం వంటి ఆచారాలను నిర్వహిస్తారు. ఈ వ్రతాన్ని భక్తితో ఆచరిస్తే కుటుంబంలో సిరిసంపదలు, సౌభాగ్యం, ఆరోగ్యం, సంతానాభివృద్ధి, శాంతి, ఐశ్వర్యం కలుగుతాయని విశ్వాసం.

**వరలక్ష్మీ వ్రతం తేదీపై ఎందుకు గందరగోళం?**


సాధారణంగా శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. స్కంద పురాణం సహా అనేక ధర్మగ్రంథాలు కూడా ఇదే విధానాన్ని సూచిస్తున్నాయి. అయితే ఈ ఏడాది శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడం, అలాగే పౌర్ణమి తిథి శుక్రవారం రోజునే ఉండడం వల్ల చాలామందికి సందేహం ఏర్పడింది. రెండో శుక్రవారం చేయాలా? లేక పౌర్ణమితో కూడిన శుక్రవారం చేయాలా? అనే ప్రశ్న తలెత్తింది.

**శాస్త్రం ప్రకారం ఏ రోజు ఆచరించాలి?**

ధర్మశాస్త్రాలలో పేర్కొన్న నియమాల ప్రకారం, పౌర్ణమి తిథి శుక్రవారాన్ని స్పృశించినప్పుడు ‘సోపాంతే భార్గవాదినే’ అనే ధర్మనియమం వర్తిస్తుంది. అందువల్ల పౌర్ణమితో కూడిన శుక్రవారం రోజున కూడా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించవచ్చని పండితులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు 28న ఉదయం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం శాస్త్రసమ్మతమని పలువురు పంచాంగకర్తలు సూచిస్తున్నారు.

**శృంగేరి సంప్రదాయం ఏమి చెబుతోంది?..**

శృంగేరి శ్రీ శారదా పీఠం సంప్రదాయంలో వరలక్ష్మీ వ్రతానికి సంబంధించిన ప్రధాన పూజలు సాయంకాలంలో నిర్వహిస్తారు. అయితే ఆగస్టు 28న




సాయంత్రం పౌర్ణమి తిథి అందుబాటులో లేకపోవడంతో, ఆ సంప్రదాయాన్ని అనుసరించే వారు ఆగస్టు 21న వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలని సూచిస్తున్నారు. అంటే....ఉదయం పూజ చేసే వారు – ఆగస్టు 28న వరలక్ష్మీ వ్రతం చేయవచ్చు. సాయంకాల పూజా విధానాన్ని అనుసరించే వారు (శృంగేరి సంప్రదాయం) – ఆగస్టు 21న వ్రతం చేయడం శ్రేయస్కరం.

**భక్తే ప్రధానము..**

వ్రతం చేసే తేదీ విషయంలో భయపడాల్సిన అవసరం లేదని పండితులు స్పష్టం చేస్తున్నారు. శ్రావణ మాసంలోని ప్రతి శుక్రవారం మహాలక్ష్మీ ఆరాధనకు అనుకూలమైనదే. ముఖ్యమైనది తేదీ కంటే భక్తి, శ్రద్ధ, పవిత్రత. నిర్మలమైన మనస్సుతో, విశ్వాసంతో మహాలక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె అనుగ్రహం తప్పకుండా లభిస్తుందని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటాయి.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ భరోసా






- కుటుంబ సభ్యులను పరామర్శించిన బీఆర్ఎస్ అధినేత..
- ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి, తల్లికి రూ.25 లక్షల ఆర్థిక సాయం

నర్సంపేట/, ఆగస్టు 9/(జన సంఘర్షణ):

తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన.. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇప్పటికే ప్రకటించిన ఆర్థిక సహాయానికి అనుగుణంగా కేసీఆర్ కుటుంబానికి అండగా నిలిచారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, వారి తల్లికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు చెక్కులను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏ కష్టంలోనైనా కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన కీలక పాత్రను, ప్రజల కోసం ఆయన చేసిన సేవలను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచి, ఆర్థిక సహాయం అందించిన కేసీఆర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తండాల్లో కోలాహలంగా ‘తీజ్’ వేడుకలు..

- బంజారా సంస్కృతికి ఘనమైన ప్రతీక!
- సంప్రదాయ నృత్యాలతో సందడి..
- బంజారా సోదరీమణులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, /ఆగస్టు 9:/(జన సంఘర్షణ)




బాన్సువాడ మండలంలోని పోచారం తండా, రాంపూర్ తండాల్లో ‘తీజ్’ పండుగ వేడుకలు ఘనంగా, కోలాహలంగా నిర్వహించారు. బంజారా సమాజానికి ఎంతో ప్రత్యేకమైన ఈ పండుగను సంప్రదాయాలు, ఆచారాలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ వేడుకలకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బంజారా సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తండావాసుల ఆనందోత్సాహాల్లో భాగస్వాములై వారిలో ఉత్సాహాన్ని నింపారు. తీజ్ పండుగలో భాగంగా సంప్రదాయ... పద్ధతిలో పెంచిన గోదుమ గడ్డి బుట్టలను (తీజ్) మహిళలు భక్తిశ్రద్ధలతో ఎత్తుకుని వేడుకల్లో పాల్గొన్నారు. బంజారా సోదరీమణులతో కలిసి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఉత్సాహంగా నృత్యం చేస్తూ పండుగ సంబరాల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తండాల్లో మహిళలు, యువత సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పాటలు, నృత్యాలతో సందడి చేయడంతో పండుగ వాతావరణం మరింత కళకళలాడింది. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి పండుగలు ఎంతో దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువతతో పాటు తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. సంప్రదాయం, ఐక్యత, ఆనందాన్ని చాటిచెప్పిన తీజ్ వేడుకలు తండాల్లో సంతోషాన్ని నింపాయి.

# సంగమేశ్వర కాలనీలో చిన్నారిపై కుక్క దాడి!

- చిన్నారిపై దాడితో ఆందోళనలో స్థానికులు.. వీధికుక్కల బెడదపై మున్సిపల్ అధికారులకు ప్రజల హెచ్చరిక

బాన్సువాడ, /ఆగస్టు 9/ (జన సంఘర్షణ):



బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీ రోడ్ నంబర్ 2లో చిన్నారిపై వీధికుక్క దాడి చేసిన ఘటన మరోసారి కలకలం రేపింది. ఈ దాడిలో చిన్నారికి గాయాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల పట్టణంలో చోటుచేసుకున్న కుక్కల దాడి ఘటనలను ప్రజలు మరువకముందే తాజాగా మరో చిన్నారిపై దాడి జరగడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కాలనీలు, ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో వీధికుక్కల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వాటి నియంత్రణపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చిన్నారులను బయటకు పంపాలంటే భయం..**

వీధికుక్కల బెడద కారణంగా చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు, ఎక్కడ కుక్కలు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**“ఇకనైనా మేల్కొనండి.. లేదంటే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సిందే!”**

వరుసగా కుక్కల దాడులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరో ప్రాణహాని జరిగే వరకు వేచి చూడకుండా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు హెచ్చరిస్తున్నారు. వీధికుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ప్రమాదకరంగా సంచరిస్తున్న కుక్కలను నియంత్రించడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించాలని కోరుతున్నారు. ఇకపై కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ఎమ్మెల్యే ఆదేశాలతో యూత్ అధ్యక్షులు సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

కామారెడ్డి జిల్లా :ఆగస్టు 9 (జన సంఘర్షణ) ప్రతినిధి



గాంధారి మండల కేంద్రంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశానుసారం ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు .ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగులూర్ రాజు స్థానిక సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్ ఏఎంసి వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వినయ్ కుమార్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సంఘని బాబా నియోజకవర్గ కార్యదర్శి నితిన్ కుమార్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీల రవి సర్పంచులు సంతోష్ శంకర్ డైరెక్టర్ బొమ్మని బాలు టౌన్ యూత్ అధ్యక్షులు ప్రశాంత్ విలేజ్ యూత్ అధ్యక్షులు గణేష్ జగన్ రమేష్ రాకేష్ కాంగ్రెస్ నాయకులు బొట్టు మొతిరం రహిమాన్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జన సంఘర్షణ
సోమవారం
10 ఆగస్టు 2026

# కాంగ్రెస్ తో కోమటిరె'ఢీ'..?

- కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యవహారం..

హైదరాబాద్/ఆగస్టు 9/(జన సంఘర్షణ)
రాష్ట్ర రాజకీయాల్లో కాకరేపుతోంది. ఏకంగా ప్రభుత్వంతో పాటు పార్టీనే ఢీకొట్టేలా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు అలజడి రేపుతున్నాయి. వివాదాస్పద నేతగా పేరొందిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇప్పటికే బాహాటంగా అధిష్ఠానం నిర్ణయాలనే తప్పుబడుతుంటే.. అన్న మంత్రి వెంకట్ రెడ్డి మాత్రం ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీకి వ్యతిరేకంగా నోరు జారడం టీపీసీసీ పెద్దలను ఆగ్రహానికి గురిచేస్తోంది. అన్నదమ్ములిద్దరూ తమదైన శైలీలో ప్రభుత్వం, పార్టీకి వ్యతిరేకంగా చేస్తోన్న ప్రకటనలు రాజకీయ దుమారాన్ని లేపాయి. తలలు పట్టుకుంటున్న హస్తం నేతలు.. ఇటీవల నల్గొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనూ ఉండదని చెప్పారు. మరో రెండు రోజుల తర్వాత నల్గొండలో జరిగిన మరో కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు వ్యాఖ్యలు అధికార పార్టీ నేతల్లో చర్చనీయాంశగా మారాయి. దీంతో వెంటనే తేరుకున్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉండదంటూ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. కాగా భారీ మెజార్టీతో గెలిపిస్తేనే పోటీ చేస్తాను లేదంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను అంటూ చేసిన వ్యాఖ్యలపై సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వస్తోంది. నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు, అభివృద్ధిపై ఫోకస్ చేస్తే ప్రజలు వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఆదరిస్తారని హస్తం నేతలు బాహాటంగానే చెబుతున్నారు. ప్రజా నాయకుడిగా పేరొందిన వెంకట్ రెడ్డి అసలు అలాంటి వ్యాఖ్యలు ఎందుకు చేశారో అర్థం కావడం లేదని తలలు పట్టుకుంటున్నారు. 'బ్రదర్స్' కోసం ఉదయ్ పూర్ డిక్లరేషన్ కు బ్రేక్..! 2023లో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచీ మంత్రి పదవిపై గళమెత్తుతున్న రాజగోపాల్ రెడ్డి.. సందర్భం వచ్చిన ప్రతిసారీ టీపీసీసీ, ఏఐసీసీ నేతలే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఎన్నికల ముందు అధిష్ఠానం ఇచ్చిన మంత్రి పదవి హామీని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. నల్లగొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటంలో తప్పులేదంటోన్న ఆయన.. మంత్రి పదవి కోసం పార్టీనే ఇరకాటంలో పడేస్తున్నట్లు సొంత పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఉదయ్ పూర్ డిక్లరేషన్ ప్రకారం.. ఎన్నికల్లో ఒకే కుటుంబంలో ఇద్దరికి టికెట్లు ఇవ్వొద్దనే నిబంధన ఉన్నప్పటికీ 2023ఎన్నికల్లో పార్టీ ఆ నిబంధనను సడలించి.. కోమటిరెడ్డి బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి పద్మావతికి టికెట్లు ఇచ్చింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా మంత్రి పదవి విషయంలో మాత్రం అధిష్ఠానం ఒకే కుటుంబంలో ఇద్దరికి మంత్రి పదవుల కేటాయింపు విషయంలో ఆలోచన చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి.. తాము ఇద్దరం సోదరులమే అయినా కుటుంబాలు వేర్వేరు అని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తన మంత్రి పదవిని అన్న వెంకటరెడ్డితో ముడిపెట్టవద్దని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ విననందుకే కాంగ్రెస్ ను వీడాను.. ఈ నెల 7న చండూరులో ఓ కార్యక్రమంలో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. ఏకంగా ప్రభుత్వ అధికారులనే లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. అవినీతి అధికారుల జాబితా తన వద్ద ఉందని హెచ్చరించడం ఏకంగా ప్రభుత్వ పనితీరునే ఇరకాటంలో పడేసిందని అధికార పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మరుసటి రోజు శనివారం.. నాడు కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని చెప్పారు. తాను రాజీనామా చేస్తేనే అప్పుడు అంతా కదిలిందన్నారు. ఆ సమయంలో



నేను చెప్పింది రాహూల్ గాంధీ కూడా వినలేదనీ అందుకే కాంగ్రెస్ ను వీడానని ఝలక్ ఇచ్చారు. అయితే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని వ్యాఖ్యానించారు. మరోవైపు తుంగతుర్తిలో తమ ప్రమేయం లేకుండా వ్యవహారాలు నడుపుతున్నారంటూ ఎమ్మెల్యే మందుల సామెల్ కోమటిరెడ్డి బ్రదర్స్పై తీవ్ర స్థాయిలో మండిపడిన వివాదంపై టీపీసీసీ విచారణ జరిపి నివేదికసమర్పించింది. అయినా పార్టీలో నేతల మధ్య జరుగుతున్న వాగ్వాదాలు అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. తెలంగాణలో రెండోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ అధిష్ఠాన.. పార్టీ విషయంలో ఎవరూ లైన్ దాటవద్దని ఇప్పటికే పలు సందర్భాల్లో నేతలను హెచ్చరించింది. పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరించవద్దని విభేదాలు వీడాలని పీఏసీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి సైతం హెచ్చరించారు. అయినా నేతలు ఇలా వివిధ కారణాలతో బజారుకెక్కడం పార్టీకి డ్యామేజ్ చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ పరిణామాలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారే అవకాశం ఉందనే ఆందోళన సొంతపార్టీ క్యాడర్ లో వ్యక్తం అవుతోంది. ఈ పరిస్థితిపై అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి ఎలా చెక్ పెడతారో అనేది ఉత్కంఠగా మారింది.

# కవిత పార్టీకి ఊహించని షాక్.. తెలంగాణ రక్షణ సేన నేతపై పోక్సో కేసు

- 11 ఏళ్ల బాలికపై లైంగిక దాడి ఆరోపణలు.
- లెక్కలు చెబుతానంటూ ఇంట్లోకి ప్రవేశించిన డేవిడ్ రాజ్

ఖమ్మం,/ ఆగస్టు 9:/(జన సంఘర్షణ
తెలంగాణలో మైనర్ బాలికలపై వేధింపులు, లైంగిక దాడుల ఘటనలు వరుసగా వెలుగుచూస్తున్న వేళ ఖమ్మం జిల్లాలో వెలుగులోకి వచ్చిన మరో ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. వైరా ప్రాంతంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జ్ గౌరవరపు డేవిడ్ రాజ్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. లెక్కలు చెబుతానంటూ డేవిడ్ రాజ్ బాలిక ఇంట్లోకి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేరు. అనంతరం బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత బాలిక జరిగిన విషయాన్ని వారికి వెల్లడించింది. దీంతో బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించగా, ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**కవిత పార్టీకి ఇబ్బందికర పరిణామం?**

ఇటీవల కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత తెలంగాణ వ్యాప్తంగా పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, పాలనపై విమర్శలు చేస్తూనే.. బీఆర్ఎస్‌పైనా పలు సందర్భాల్లో ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో కవిత పార్టీతో



అనుబంధంగా ఉన్నట్లు ప్రచారంలో ఉన్న తెలంగాణ రక్షణ సేన నాయకుడిపై పోక్సో కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై కవిత స్పందన ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే కేసులో నమోదైన ఆరోపణలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# బోనాల ఉత్సవాల్లో పోచారం సందడి

- ఖిల్లా మైసమ్మ, మహంకాళి ఆలయాల్లో ప్రత్యేక పూజలు..
- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష

కామారెడ్డి జిల్లా, ఆగస్టు 9/(జన సంఘర్షణ)
ఆషాఢమాస బోనాల ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సందడి చేశారు.
హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ఖిల్లా మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్తో కలిసి ఖిల్లా మైసమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించిన పోచారం శ్రీనివాసరెడ్డి.. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం జియాగూడ సబ్జీ



మండి మహంకాళి ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు అక్కడ నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆయనకు ఆలయ ప్రాంగణంలో ఘన స్వాగతం లభించింది. ఆలయ గజరాజు గజమాలతో పోచారం శ్రీనివాసరెడ్డిని సత్కరించి ఆశీర్వదిస్తూ స్వాగతం పలికింది.

**తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక**

ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ బోనాల వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో తరించారు.

# "సూపర్ స్టార్ మహేష్ బాబుకు ఘనంగా 51వ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి సంబరాలు..
- అభిమానులతో కలిసి గ్రామ సర్పంచ్ సందడి

పోతంగల్ జిల్లా పల్లి/ఆగస్టు 9:/(జన సంఘర్షణ)






సూపర్ స్టార్ మహేష్ బాబు 51వ జన్మదిన వేడుకలు గ్రామంలో అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, అభిమానులు, గ్రామ ప్రజలు, చిన్నారులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. మహేష్ బాబు చిత్రాలపై తమకున్న అభిమానాన్ని చాటుకుంటూ అభిమానులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసిన అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. గ్రామంలో నిర్వహించిన ఈ వేడుకలు అభిమానుల కేరింతలతో ఉత్సాహభరితంగా సాగాయి.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బర్మావత్ వివేక్ మాట్లాడుతూ.. మహేష్ బాబు మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండిన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఆయన సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యత పట్ల చూపుతున్న చొరవ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ మొహమ్మద్ ఖాన్ పఠాన్, బిఖ్యా నాయక్, నరేష్, మూడు జీవన్, బలరాం, రమేష్తో పాటు అభిమానులు, గ్రామ ప్రజలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తీవ్ర విషాదం.. మెడికల్ విద్యార్థిని ప్రియాంక మృతి

- రాజమండ్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ప్రియాంక..
- ఈరోజు మధ్యాహ్నం 3:40 గంటలకు కన్నుమూత

రాజమండ్రి, /ఆగస్టు 9: / (జన సంఘర్షణ)



రాజమండ్రిలో ఈ నెల 3వ తేదీన జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికల్ విద్యార్థిని ప్రియాంక మృతి చెందింది. ప్రసాదిత్యా మాల్ వద్ద ప్రియాంకపై కారు ఎక్కించిన ఘటనలో దుష్యంత్, ఆండ్రూ అనే యువకులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రియాంకను మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ గత కొన్ని రోజులుగా ప్రాణాలతో పోరాడుతూ చికిత్స పొందిన ఆమె.. పరిస్థితి విషమించడంతో ఆదివారం మధ్యాహ్నం 3:40 గంటలకు తుదిశ్వాస విడిచింది. ప్రియాంక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మెడికల్ విద్యార్థిని అకాల మరణం పట్ల బంధువులు, స్నేహితులు, సహ విద్యార్థులు తీవ్ర విషాదం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పూర్తి వివరాలు, పోలీసుల దర్యాప్తులో వెలువడాల్సి ఉంది.

# పేద విద్యార్థుల భవిష్యత్తుపై చెలగాటమా!!

- ఇది తగదు/ మాజీ డిజిపి సునీల్ కుమార్

కోట ఆగస్టు 9 (జన సంఘర్షణ)
ఎక్సలెన్సీ సెంటర్ల పేరుతో డాక్టర్ అంబేద్కర్ ఎస్ సి గురుకుల విద్యార్థులను వేరే చోటికి తరలించడం వారి ఉజ్వల భవిష్యత్తుపై వేటు వేయడమేనని ఏఐఎం వ్యవస్థాపకులు, మాజీ డిజిపి పివి సునీల్ కుమార్ తమ ఆవేదనను వ్యక్తం చేశారు . ఆదివారం వాకాడు కోట మండలాలలోని ఎస్సీ గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాలను బహుజన యూత్ నాయకులు కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగిన విషయాలను తెలుసుకొని తమ బాధను వ్యక్తం చేశారు . కోటలో ఎస్సీ గురుకులంలో ఉన్న 600 మంది విద్యార్థులను వాకాడికి ఇతర ప్రాంతాలకు తరలించడం అసలు వాకాడులో ఉన్న విద్యార్థులకి రూములు వగైరా ,వాష్రూములు సరిపోవడంలేదని, మరి ఇక్కడి విద్యార్థులను కూడా వాకాడు కి తరలిస్తే వారి బాధలు వర్ణనాతీతం అన్నారు. అలాంటి వాతావరణంలో, చదువు ఎలా సాగుతుందో అర్థం కావడం లేదని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఎక్సలెన్సీ సెంటర్కు తాము ఏమాత్రం విరుద్ధం కాదని అలాగని ఎస్సీ గురుకుల లోని పిల్లలను వేరే చోటికి తరలించడం అనేది మంచి పని కాదన్నారు. ఎక్సలెంట్ సెంటర్ కి కావాలంటే వేరే రెంటేడ్ బిల్డింగులు రెడీగా ఉన్నాయని ఎస్సీ కార్పొరేట్ ఫండ్ 20 వేల కోట్లు ఉన్నాయని, అందులో కేవలం సంవత్సరానికి 10 లక్షలు ఖర్చు పెడితే వేరే బిల్డింగులు రెంటుకు దొరుకుతాయి అన్నారు. అలా చేయక పేద విద్యార్థులనుఈ విధంగా హింస పెట్టడం మంచి పని కాదన్నారు.తమది ఏ రాజకీయ పార్టీ కాదన్నారు. ఇక్కడ జరుగుతున్న విషయాలను బట్టి స్పందిస్తున్నామే తప్ప వేరే ఉద్దేశం లేదన్నారు. ఈరోజు చూసాము వెళ్లిపోయాం అనేది కాకుండా పూర్వ విద్యార్థులను వారి వారి గురుకులాలకి తరలించే వరకు మా ఉద్యమం ఆగదని ఆయన గట్టిగా చెప్పారు. కోట నుండి 600 మంది విద్యార్థులను తరలించడం అనేది మరి ఏ విధంగా ప్రభుత్వం ఆలోచించిందో తమకు అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో మూడు చోట్ల ఈ విధంగా ఎస్సీ గురుకుల విద్యార్థులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. జీవో ను సవరించి మరల ఎచట ఉన్న విద్యార్థులు అచటికి రప్పించే వరకు మా ఉద్యమం ఆగదని ఆయన నొక్కి వక్కాణించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బహుజన యూత్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా టీఆర్ఎస్ కల్వకుంట్ల కవిత శుభాకాంక్షలు

హైదరాబాద్/ఆగస్టు 9/(జన సంఘర్షణ)





హైదరాబాద్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివాసీ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. అడవితో మమేకమై జీవిస్తూ.. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీ సమాజం అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు. ఆదివాసీ సమాజం తరతరాలుగా ప్రకృతిని తమ జీవన విధానంలో భాగంగా చేసుకుని, అడవులు, జల వనరులు, భూమిని కాపాడుతూ వస్తోందని కవిత పేర్కొన్నారు. భారతీయ సమాజానికి తమదైన ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, జీవన విలువలను వారసత్వంగా అందిస్తున్న ఆదివాసీల పాత్ర ఎంతో గొప్పదని ఆమె అన్నారు. ప్రకృతితో సహజీవనం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు ఆదివాసీలు అందిస్తున్న కృషి సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదేవిధంగా ఆదివాసీ సమాజానికి సంబంధించిన హక్కులు, ఆత్మగౌరవం, స్వావలంబన కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు సమర్థవంతంగా అమలయ్యేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మరోసారి ఆదివాసీ సోదర, సోదరీమణులందరికీ కవిత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళలను రహస్యంగా వీడియో తీసి.. అడ్డంగా దొరికిపోయాడు!

- ఢిల్లీ మెట్రోలో యువతుల వీడియోలు తీస్తూ పట్టుబడిన వ్యక్తి
- ఫోన్‌లో డిలీట్ చేసినా.. 'రీసైకిల్ బిన్'లో దొరికిన ఆధారాలు

న్యూఢిల్లీ,/ ఆగస్టు 9/జన సంఘర్షణ):





మహిళలు, యువతులను రహస్యంగా వీడియో తీస్తూ ఓ వ్యక్తి అడ్డంగా దొరికిపోయిన ఘటన ఢిల్లీ మెట్రోలో చోటుచేసుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఢిల్లీ మెట్రోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తన ఫోన్‌తో మహిళలు, యువతులను రహస్యంగా వీడియోలు తీస్తున్నట్లు కొందరు మహిళలు గమనించారు. దీంతో వారు వెంటనే అతడిని నిలదీశారు. దీంతో ఆ వ్యక్తి తన ఫోన్‌లో ఉన్న ఫొటోలు, వీడియోలను తొందరగా డిలీట్ చేసి.. తాను ఎలాంటి వీడియోలు తీయలేదంటూ తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయితే అనుమానం వచ్చిన మహిళలు అతడి ఫోన్‌ను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. డిలీట్ చేసిన ఫొటోలు, వీడియోలు ఫోన్‌లోని లి'రీసైకిల్ బిన్'లిలో కనిపించడంతో అతడి వ్యవహారం బట్టబయలైంది. తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆధారాలతో సహా పట్టుబడటంతో అక్కడి మహిళలు అతడిని నిలదీసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు.

**మహిళల భద్రతపై అప్రమత్తత అవసరం**


బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వారి అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు తీయడం వేధింపులకు దారితీసే చర్యగా మారే అవకాశం ఉంది. ఇలాంటి ఘటనలను గమనించినప్పుడు బాధితులు లేదా ప్రత్యక్ష సాక్షులు వెంటనే మెట్రో సిబ్బంది, భద్రతా సిబ్బంది లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. మహిళల గోప్యతకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, ఇలాంటి ఘటనలపై ఫిర్యాదు అందిన వెంటనే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

# ఫైన్ డబ్బుల ఒత్తిడి.. భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం!

- రూ.5 లక్షలు చెల్లించాలంటూ ఒత్తిడి.. ఎలుకల మందు తాగిన దంపతులు
- భర్త పరిస్థితి విషమం.. జిల్లా ఎస్పీ పేరిట సూసైడ్ నోట్ స్వాధీనం

భిక్కనూరు,/ ఆగస్టు 9/(జన సంఘర్షణ:

ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి చెల్లించాల్సిన ఫైన్ డబ్బుల కోసం ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్యాభర్తలు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో శనివారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు నెలల క్రితం మెదక్ జిల్లా రామాయంపేట నుంచి ప్యాసింజర్ ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు నిర్ణయించడంతో మృతుడి కుటుంబానికి రూ.6 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆటో యజమాని తరఫున మృతుడి కుటుంబానికి అదే రోజు రూ.లక్ష అడ్వాన్స్‌గా చెల్లించగా.. మిగిలిన రూ.5 లక్షలను రెండు వాయిదాల్లో చెల్లించేలా బాండ్ పేపర్‌పై రాసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించాలంటూ మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి పెరగడం, ప్రస్తుతం అంత మొత్తాన్ని చెల్లించే ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో శ్రీనివాస్ గౌడ్, శ్రీలత దంపతులు తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఈ క్రమంలో ఇంట్లో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.విషయం గమనించిన స్థానికులు వెంటనే వారిని అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఎలుకల మందు ఎక్కువగా తీసుకోవడంతో భర్త శ్రీనివాస్ గౌడ్ కోమాలోకి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. భార్య శ్రీలతకు చికిత్స అనంతరం ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రస్తుతం మాట్లాడుతున్నట్లు వెల్లడించారు.



**ఎస్పీ పేరిట సూసైడ్ నోట్**

ఆత్మహత్యకు పాల్పడే ముందు తమ పరిస్థితిని వివరిస్తూ జిల్లా ఎస్పీ పేరిట ఓ సూసైడ్ నోట్ రాసి జేబులో పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆ చీటీని పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఒత్తిడి పెంచితే ప్రాణాలు పోయే పరిస్థితి.. పోలీసులు కఠినంగా స్పందించాలి. ఆర్థిక లావాదేవీలు, ప్రమాద పరిహారం వంటి విషయాల్లో వ్యక్తులపై నేరుగా ఒత్తిడి పెంచడం వల్ల ఇలాంటి విషాదకర ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేసి, సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా.. ప్రమాద పరిహారం పేరుతో ఎవరైనా బెదిరింపులకు లేదా అధిక ఒత్తిడికి పాల్పడినట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిక జారీ చేయాల్సిన అవసరం ఉంది. బాధితులు, మృతుడి కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు గ్రామస్థాయిలో ఒత్తిళ్లకు తావివ్వకుండా పోలీసుల సమక్షంలో చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని అధికారులు సూచించాలి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వికలాంగుల హక్కుల పరిరక్షణకు ఉద్యమం

- ఆగస్టు 11న బోధన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా సదస్సు
- వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, పెన్షన్‌దారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి

కోటగిరి, )ఆగస్టు 9:/జన సంఘర్షణ

వికలాంగుల హక్కులు, సంక్షేమ పథకాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.ఆదివారం ఉమ్మడి కోటగిరి--పోతంగల్ మండలాల పరిధిలోని సోంపూర్ గ్రామంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు గైని రాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడారు. ఆగస్టు 11న ఉదయం 10 గంటలకు బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ హనుమాన్ మందిరం--మార్కండేయ మందిరం సమీపంలోని రాకాసిపేట్ గ్రామ అభివృద్ధి కమిటీ ఫంక్షన్ హాల్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బసవరాజ్ పాటిల్, నిజామాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. రమేష్ బాబు హాజరుకానున్నట్లు వెల్లడించారు.



**హక్కులు, సంక్షేమ పథకాలపై చర్చ**

సదస్సులో వికలాంగులకు ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు, అలాగే వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నట్లు గంగాధర్ తెలిపారు. సదస్సులో గుర్తించిన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాటాలు చేపడతామని అన్నారు. ఉమ్మడి కోటగిరి, పోతంగల్ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, పెన్షన్‌దారులు పెద్ద సంఖ్యలో హాజరై జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఎన్నికల హామీలు అమలు చేయాలి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో వృద్ధులు, ఒంటరి మహిళలు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గంగాధర్ డిమాండ్ చేశారు. ఆయా వర్గాల సమస్యల పరిష్కారానికి సదస్సులో నిర్ణయాలు తీసుకుని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గైని రాములు, జిల్లా ఉపాధ్యక్షులు దేవదాస్, మేత్రి చిన్న గంగారం, శరత్ పవర్, నగేష్, మహేష్, సిద్ధ పూలే గంగాసాగర్, మేత్రి సావిత్రి, హనుమంతరావు పవర్, గంగారం పటేల్, సిందే గంగా, బాజీరావు, సిందే గంగారాం పటేల్, మహేష్, సాయిలు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# దోమలెడ్గి, కల్లూర్‌లో ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీలు

- మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ కమిటీల ఏర్పాటు
- నూతన కమిటీ సభ్యులకు నాయకుల శుభాకాంక్షలు

పోతంగల్,/ ఆగస్టు 9/జన సంఘర్షణ:



పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పోతంగల్ మండలంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామస్థాయి కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండలంలోని దోమలెడ్గి, కల్లూర్ గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీలను విజయవంతంగా ఎన్నుకున్నారు. పోతంగల్ మండల నూతన కమిటీ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సంస్థను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు మాదిగల హక్కులు, సామాజిక సమస్యలపై ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు. నూతన కమిటీల ఏర్పాటులో నేరోళ్ల అశోక్ మాదిగ, నకేవర్ హరిదాస్ మాదిగ, కర్రే సాయినాథ్ మాదిగ కీలకంగా వ్యవహరించారు. దోమలెడ్గి, కల్లూర్ గ్రామాలకు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

**గ్రామస్థాయి నుంచే ఉద్యమానికి బలం...**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మరింత విస్తృతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని నాయకులు పిలుపునిచ్చారు. నూతన కమిటీలు సమన్వయంతో పనిచేస్తూ సంస్థ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ యువ నాయకులు కాంబ్లే రాజేష్ మాదిగ, మెత్రి సంజీవ్ మాదిగ, గొంటి నవీన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co